ఉరకలేసిన సామాజిక ఉత్సాహం



వేదికపై మాట్లాడుతున్న అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు,
వేదికపై మంత్రి కారుమూరి, ఎంపీలు మోపిదేవి రమణ, నందిగం సురేష్, జెడ్పీ చైర్‌పర్సన్ హారిక తదితరులు



సభాప్రాంగణానికి వస్తున్న నేతలు



ప్రజలను పలకరిస్తున్న మంత్రి కారుమూరి

అవనిగడ్డలో జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్రలో పిన్న, పెద్ద తేడా లేకుండా అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు. వీరితో ఈ ప్రాంత ప్రధాన రహదారులు జన సంద్రంగా మారాయి. వైఎస్సార్ సీపీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు పాదయాత్ర చేశారు. నియోజకవర్గంలోని మండలాల నుంచి వేలాదిగా తరలివచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కేరింతలు కొడుతూ యాత్రలో సందడి చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం చేసిన కృషిని వివరించడానికి చేపట్టిన బస్సు యాత్రలో జై జగన్ నినాదాలు మార్మోగాయి. నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



సభకు వచ్చిన జన సందోహంలో ఓ భాగం



సభకు వస్తున్న ప్రజానీకం



కళాకారుల డప్పు నృత్య ప్రదర్శన

క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ మండల సమావేశం

పెడన: మండలంలోని వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ముఖ్య నాయకులు శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు పెడన మార్కెట్ యార్డు సమావేశం హాలులో జరిగే సమావేశానికి హాజరు కావాలని ఆ పార్టీ మండల కన్వీనర్ కె.నాగబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల రెండో వారంలో జరిగే ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమంపై సమీక్షిస్తారని పేర్కొన్నారు.

వృద్ధులకు అన్నదానం



మచిలీపట్నంటౌన్: స్థానిక ఈడేపల్లి జట్టి నరసింహం ప్రభుత్వ వృద్ధుల, వికలాంగుల ఆశ్రమంలో గురువారం అన్నదానం చేశారు. మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ భర్త, మాజీ కౌన్సిలర్ చిటికిన నాగేశ్వరరావు జన్మదినం సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) కార్యక్రమానికి హాజరై వృద్ధులు, వికలాంగులకు వడ్డన చేశారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ సభ్యులు బేతపూడి రవి, మాజీ డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, వైఎస్సార్ సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు వీఏఎన్ మూర్తి, వైఎస్సార్ సీపీ నాయకులు ధనికొండ శ్రీనివాసరావు, కేశన నాని, మన్నే శేషారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



బంటుమిల్లి: సెయింట్‌జాన్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో టీచరుగా పని చేస్తూ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన నందిగామ తిరుమల మాస్టారుకు పెడన సహాయ ఫౌండేషన్ ప్రతినిధులు ఆర్థిక సాయం అందజేశారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గురువారం ఫౌండేషన్ ప్రతినిధులు పాఠశాల డైరెక్టరు సాబూజాన్ ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులకు రూ. 18వేల చెక్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు ఎండీ ఉస్మాన్‌బాషా, వ్యాపారవేత్త గాజుల సాంబయ్యనాయుడు, సభ్యులు మస్తాన్‌బేగ్, ఊర బలరాం, పుప్పాల నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవిడ్ శామ్యూల్‌కు సత్కారం



మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన గాడెల్లి దేవిడ్‌శామ్యూల్‌ను 2వ డివిజన్ కార్పొరేటర్ పరింకాయల విజయ్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు గురువారం ఘనంగా సన్మానించారు. డివిజనలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో దేవిడ్‌శామ్యూల్‌కు శాలువా కప్పి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా నాయకుడు బందెల థామస్‌నోబుల్‌ను కూడా సన్మానించారు.

జగనన్నకు చెబుదాం వాయిదా

మోపిదేవి: ప్రభుత్వం ప్రకటించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమం వాయిదా వేసినట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎప్పుడు నిర్వహించేది తర్వాత ప్రకటిస్తామని పేర్కొన్నారు. 3వ తేదీ శుక్రవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించాల్సి ఉందని అనివార్య కారణాలతో వాయిదా వేస్తున్నట్లు ఆయన వివరించారు.

సచివాలయాలతో మెరుగైన సేవలు

పమిడిముక్కల: సచివాలయాల ఏర్పాటుతో ప్రజల ముంగిటకే పౌరసేవలు అందుతున్నాయని కృష్ణాజిల్లా పీఆర్ ఎస్ఈ కె.విజయకుమారి తెలిపారు. జిల్లాలో శరవేగంగా సచివాలయ, ఆర్బీకే, హెల్త్‌సెంటర్ల భవన నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ఈ నెల 4వ తేదీ నాటికి జిల్లాలో 35 సచివాలయాలు, 20 హెల్త్ సెంటర్లు, 21 ఆర్బీకేల నిర్మాణం పూర్తి చేసి అప్పగించేందుకు చర్య తీసుకొంటున్నామన్నారు. మండంలోని వీరంకి, పమిడిముక్కల, తాడంకి గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ సెంటర్ల పనులను గురువారం ఎస్ఈ పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలతో పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. మండలంలో జరుగుతున్న పనుల వివరాలను డీఈ శ్రీనివాసరావు, ఏఈ శరాబందిరాజులను అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడారు. పామర్రు నియోజకవర్గంలో 49 సచివాలయాలకు 26 పూర్తి చేశామని, మరో 13 పూర్తి చేస్తామన్నారు.

సురక్షతో పేదల ఆరోగ్యానికి భద్రత



కోనేరుసెంటర్: జగనన్న ఆరోగ్య సురక్ష పేదల ఆరోగ్యానికి భద్రత ఇస్తోందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు అన్నారు. సుల్తానగరంలోని ఎంపీయూపీ స్కూల్లో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్య సిబ్బంది 585 మందికి వివిధ రకాల పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. కంటి పరీక్షలు చేసిన వైద్యులు శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని పెద్ద ఆసుపత్రికి సిఫార్సు చేశారు. కంటి చూపు లోపించిన వారికి కళ్లజోళ్లను పంపిణీ చేశారు. శిబిరాన్ని సందర్శించిన పేర్ని కిట్టు మాట్లాడుతూ మండలంలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. వైద్య సిబ్బందికి గ్రామస్తులు సహకరించాలని కోరారు. మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే ఉందని నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌చార్జి వెంకటేశ్వరరావు, మండల అధికారి బాలకృష్ణారావు, గ్రామ పెద్దలు వైద్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

గుడివాడటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి పోటీలకు స్థానిక ఏకేటీపీ మున్సిపల్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.ఉమామహేశ్వరరావు గురువారం క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు చెందిన ఎ.దేవి అండర్–17 ఖో–ఖో పోటీల్లో, ఎం.శశిశ్రీ అండర్–14 బాస్కెట్ బాల్ పోటీలకు, ఎల్.లక్ష్మీ ధనుశ్రీ అండర్–14 కరాటే పోటీలకు ఎంపికైనట్లు ఉమామహేశ్వరరావు తెలిపారు. ఇంతటి ప్రతిభను కనపర్చిన విద్యార్థులను, వారికి తర్ఫీదు ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయురాలు కె.అనూరాధను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఓట్ల చేర్పులు, మార్పులకు ప్రత్యేక శిబిరాలను వినియోగించుకోండి

పెడన: నియోజకవర్గంలోని ప్రతి పోలింగ్ కేంద్రంలో ఈ నెల 4, 5 తేదీల్లో ఏర్పాటుచేయనున్న ప్రత్యేక శిబిరాల్లో ఓట్ల మార్పులు, చేర్పులు ఉంటే చేసుకోవచ్చని పెడన నియోజకవర్గ ఎన్నికల అధికారి కె.రాజ్యలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పెడనతో పాటు గూడూరు, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లో ఎక్కడైతే గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఓటు హక్కు వినియోగించుకున్నారో ఆ కేంద్రంలో తమ ఓటు ఉందో లేదో పరిశీలించుకోవాలని సూచించారు. మరెక్కడైనా ఉందో లేదో స్వయంగా చూసుకుని లేకపోతే కొత్తగా నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఒకే కుటుంబంలోని వారంతా ఒకే పోలింగ్ కేంద్రంలోనే ఉండేలా చూసుకోవాలని, వేరే పోలింగ్ కేంద్రంలోకి వెళ్తే ఆ ఓటును మార్పించుకునే అవకాశం ఉందని వివరించారు. ఈ నెల 4, 5 తేదీల్లోనే కాకుండా డిసెంబరు 2, 3 తేదీల్లో కూడా ప్రత్యేక శిబిరాలుంటాయని పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయా తేదీల్లో పోలింగ్ సిబ్బంది వివరాలు నమోదు చేసుకుంటారని పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో ఓటరు నమోదు

గూడూరు: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శని, ఆదివారాల్లో తప్పనిసరిగా ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించాలని తహసీల్దార్ బి.విజయప్రసాద్ బీఎల్వోలను ఆదేశించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో గురువారం బూత్ స్థాయి అధికారులతో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని అన్ని పోలింగ్ బూత్‌లలో ఇప్పటికే ముసాయిదా ఓటరు జాబితాను ప్రజల సందర్శనార్థం ప్రచురించినట్లు వివరించారు. వాటిపై ఏమైనా అభ్యంతరాలు ఉన్నా.. సవరణలు ఉన్నా.. ఓటర్ల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని కోరారు. పోలింగ బూత్ పరిధిలో 18 ఏళ్లు పూర్తయిన వారు ఉంటే వారికి ఓటు హక్కు కల్పించడానికి ఫారం –6 దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీటీ వై.శివశంకర్, సర్వేయర్ జి.వెంకటేశ్వరరావు, వివిధ గ్రామాల వీఆర్వోలు, బీఎల్వోలు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి వైభవయాత్ర

బంటుమిల్లి: వేంకటేశ్వరస్వామి వైభవయాత్రకు ఘనస్వాగతం పలికారు. వంద రోజుల శ్రీ వెంకటేశ్వర వైభవయాత్ర కార్యక్రమాల్లో భాగంగా గురువారం బంటుమిల్లికి రథయాత్ర చేరుకుంది. భీమవరం పట్టణం నుంచి స్థానిక రామాలయం వద్దకు చేరుకున్న రథానికి భక్తులు కోలాటంతోపాటు భక్తి పాటలు పాడుతూ, గోవిందనామాలు చెబుతూ గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం స్థానిక వేంకటేశ్వరస్వామి గుడివద్ద రథంలో వచ్చిన స్వామివారి ఉత్సవ మూర్తులను ఉంచి కోలాట నృత్య ప్రదర్శన, సామూహిక కుంకుమ పూజలు, విష్ణు సహస్రనామాలు, వేంకటేశ్వర గానామృతం తదితర భక్తి శ్లోకాలతో రంజింపచేశారు. ఈ సందర్భంగా పండితులు పవన్, సాయిలు ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సబ్బిశెట్టి రాజ, సభ్యులు కె.శ్రీనివాసరావు, వి.బాబు, యూపీఆర్ విఠల్, సీహెచ్ రాధాకృష్ణ, వాసవీక్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



రథయాత్రలో భక్తులు

విద్యార్థుల భద్రతకు చర్యలు తీసుకోండి

కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు మెరుగైన వసతి, భోజన సదుపాయాలతో పాటు భద్రత చర్యలు కట్టుదిట్టం చేయాలని విశ్వవిద్యాలయం ఉప కులపతి జ్ఞానమణిని బీసీ సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం సంఘ నాయకులు వీసీని కలిసి వినతిపత్రం అందజేశారు. బి.సి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శేకుపోయిన సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి విశ్వవిద్యాలయానికి వచ్చే విద్యార్థులకు సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దూరప్రాంతాల నుంచి వచ్చే వారికి యూనివర్సిటీలో క్యాంటీన్ సదుపాయం లేదన్నారు. ఆవరణలో ప్రహరీ నిర్మించి విద్యార్థులకు భద్రత కల్పించాలన్నారు. నిర్మాణ దశలో ఉన్న పనులు పూర్తి చేయాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘ నాయకులు జోగి శివ, ధనికొండ చిన్ని, నిక్కు రాధాకష్ణ, జన్ను గోవిందు, చేబోయిన కోటేశ్వరరావు, ఎం. పవన్ తదితరులు ఉన్నారు.



వీసీకి వినతిపత్రం అందజేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

తిరు నక్షత్ర వేడుకల్లో పాల్గొనండి

గుడివాడటౌన్: త్రిదండి రామానుజ చినజీయర్ స్వామి తిరు నక్షత్ర పర్వదిన వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని అహోబిల రామానుజ జీయర్ స్వామి కోరారు. స్థానిక జగన్నాథపురం పాటిమీద వేం చేసి ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో గురువారం జీయర్ స్వామి భక్తులతో మాట్లాడారు. తొలుత ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం, ఆలయ అర్చకులు.. జీయర్ స్వామి వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారు మాట్లాడుతూ.. ఈ నెల 6 నుంచి 12వ తేదీ వరకు విజయకీలాద్రిలో తిరునక్షత్ర పర్వదిన వేడుకలు జరుగుతాయన్నారు.

డ్రాప్ అవుట్స్ విద్యార్థులకు స్పెషల్ డ్రైవ్

కురుమద్దాలి(పామర్రు): మండల పరిధిలో పదవ తరగతి, ఇంటర్మీడియెట్ ఫెయిల్ అయ్యి సప్లిమెంటరీ ఫీజు కట్టకుండా ఉన్న వారిని గుర్తించేందుకు స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నామని పామర్రు ఎంఈవో–2 పద్మవాణి తెలిపారు. మండల పరిధి కురుమద్దాలి గ్రామంలో గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 100 శాతం గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రిజిస్ట్రేషన్(జీఈఆర్)లో భాగంగా ఈ స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నామన్నారు. మండలంలో డ్రాప్ అవుట్స్ విద్యార్థులను గుర్తించి వారు స్థానిక సచివాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

అవినీతి నిర్మూలనతోనే దేశాభివృద్ధి



విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

ఎదురుమొండి(నాగాయలంక): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నాగాయలంక బ్రాంచి ఆధ్వర్యంలో గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం అవినీతి నిర్మూలన–మన దేశ ప్రగతి అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు, ప్రతిభా పాటవ పోటీలు జరిపారు. బ్రాంచి మేనేజర్ రవికుమార్ మాట్లాడుతూ అవినీతి రహిత సమాజానికి బాల్యం నుంచే ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా జరిగిన కార్యక్రమంలో బాలబాలికలకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ అవినీతి నిర్మూలనపై బాలలు, ఉపాధ్యాయులతో ప్రతిజ్ఞచేయించారు. ఫీల్డ్ ఆఫీసర్ సౌరవ్‌కుమార్, సిబ్బంది, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు



మోపిదేవి: శిథిలమైన విద్యుత్ పోల్స్ తొలగించి కొత్తవి ఏర్పాటు చేసినట్లు మండల విద్యుత్‌శాఖ ఏఈ పాండురంగారావు తెలిపారు. మోపిదేవిలో ప్రధాన జాతీయ రహదారిలో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి గుడి సెంటర్ వరకు గురువారం కొత్త పోల్స్ వేశారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ స్థానిక శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సమయంలో ఏటా గ్రామంలో రథోత్సవం నిర్వహిస్తారని తెలిపారు. ఆ సమయంలో శిథిలమై పోల్స్‌తో భక్తులు తీవ్రఇబ్బందులు పడుతుండటంతో పాతవాటిని తొలగించి డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో కొత్తవి ఏర్పాటు చేసినట్లు వివరించారు.

చికిత్స పొందుతూ తాపీ మేస్త్రి మృతి

కోనేరుసెంటర్: కడుపు నొప్పి తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ తాపీమేస్త్రి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఘటనపై చిలకలపూడి పోలీసులు కేసు నమోదు చేశారు. ఉండి మండలం ఉప్పులూరు గ్రామానికి చెందిన కంది సూరిబాబు తాపీ పని చేస్తుంటాడు. అతను కొంతకాలంగా సూరిబాబు కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఈ నెల 30న మచిలీపట్నం టెంపుల్ కాలనీలో నివసిస్తున్న బావమరిది సిరి వరపు రాంబాబు ఇంటికి చుట్టం చూపుగా వచ్చాడు. అతనికి కడుపునొప్పి అధికం కావడంతో భరించలేని రాంబాబు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వాంతులు చేసుకుంటున్న రాంబాబును చూసిన బంధువులు చికిత్స నిమిత్తం హుటాహుటిన బందరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటినుంచి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాంబాబు గురువారం మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

92.31 శాతం పింఛన్ల పంపిణీ

మచిలీపట్నంటౌన్: వైఎస్సార్ సామాజిక పింఛన్ల పంపిణీలో భాగంగా గురువారం నగరంలో 95.31 శాతం మందికి అందజేశాం. నగరంలో మొత్తం 19,048 పింఛన్లు ఉండగా వీటిలో 18,155 పంపిణీ చేశారు. ఇంకా 893 మందికి పంపిణీ చేయాల్సి ఉంది. పింఛన్ల పంపిణీలో మచిలీపట్నం నగరపాలక సంస్థ జిల్లాలో రెండో స్థానంలో నిలిచింది. నగరంలోని 8వ డివిజన్ ఆర్టీసీ కాలనీకి చెందిన మందా సీతారావమ్మ అనే వృద్ధురాలు తన కుమారుడు మరణించడంతో మొవ్వ మండలం కాజ వెళ్లింది. ఆమె పింఛన్‌ను ఇచ్చి రావాలని కార్పొరేటర్ శ్రీరాం చిన్నా సూచించటంతో వలంటీర్ తిరుమలశెట్టి వెంకటేశ్వరమ్మ కాజ గ్రామానికి వెళ్లి అందజేసి వచ్చింది. అదే డివిజన్‌కు చెందిన మొహమ్మద్ ఆశాబీ అనే వృద్ధురాలు అత్యవసర పనిపై విజయవాడ వెళ్లేందుకు బస్టాండ్‌కు వచ్చారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ శ్రీరాం చిన్నా వలంటీర్ మొహమ్మద్ ఫరీదాను బస్టాండ్‌కు పంపి బస్సు ఎక్కిన ఆశాబీకి పింఛన్ అందజేశారు.



బస్సు ఎక్కిన ఆశాబీకి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఫరీదా

విజిలెన్స్ అవగాహన ర్యాలీ

మచిలీపట్నంటౌన్: నగరంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయం అధికారి కె. వెంకట్రావు ఆధ్వర్యంలో గురువారం నగరంలో విజిలెన్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రాంతీయ కార్యాలయం నుంచి కోనేరుసెంటర్ మీదుగా పోర్టు రోడ్డులోని పట్టాభి యూనియన్ బ్యాంక్ వరకు ర్యాలీ జరిగింది. అనంతరం మొక్కలు నాటారు. బ్యాంకు వ్యవస్థాపకుడు డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య ఇంటి ఆవరణలో, కోనేరుసెంటర్‌లో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం ఉపప్రాంతీయ అధికారులు వి.బ్రహ్మయ్య, ఎస్.సంతోష్, విజిలెన్స్ ఆఫీసర్ వెంకటరాజు, యూనియన్ లీడర్ అవార్డు స్టాఫ్ రీజనల్ కార్యదర్శి వై.దుర్గారావు, ఉపకార్యదర్శి సీహెచ్ సలార్, కార్యదర్శి డి. రాజేష్ పాల్గొన్నారు.



ర్యాలీలో యూనియన్ బ్యాంక్ ఉద్యోగులు

విద్యార్థులకు రక్త నమూనా పరీక్షలు

గుడివాడటౌన్: స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు గురువారం రక్త నమూనా పరీక్షలు నిర్వహించామని ప్రిన్సిపాల్ ఎస్‌హెచ్‌వీ ప్రసాదరావు తెలిపారు. కళాశాల ఆడిటోరియంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విజయవాడ ఆంధ్ర హాస్పిటల్ నేతృత్వంలో ఈ పరీక్షలు జరిగాయన్నారు. మొత్తం 450 మంది విద్యార్థులకు పరీక్షలు చేశారన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రసాదరావు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరి రక్త నమూనాలు కళాశాల వద్ద అందుబాటులో ఉంటాయన్నారు. దీని వలన అనేక ప్రయోజనాలు ఉన్నాయని, ప్రమాదవశాత్తు ఎవరికైనా అత్యవసరంగా రక్తం అవసరమైతే వారి నమూనా తెలుసుకోవడానికి, రక్తం అవసరమైన సమయాల్లో ఆ గ్రూప్ వారిని రక్తదానానికి ఆహ్వానించడానికి వీలుంటుందన్నారు.
దీన్ని దృష్టిలో పెట్టుకుని రక్త పరీక్షలు నిర్వహించామని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వేములపల్లి కోదండరామయ్య, ఆస్పత్రి టెక్నీషియన్స్ ఎం.సంతోష్, పి.స్వాతి, వెంకట సాయి, నరేష్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భానుప్రసాద్ ఎంపిక

తోట్లవల్లూరు: కృష్ణాజిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన గుడివాడలో జరిగిన అండర్ 14, 17 సంవత్సరాలలోపు బాల, బాలికల అథ్లెటిక్స్ సెలక్షన్స్‌లో పెనమకూరు జెడ్పీ పాఠశాల 8వ తరగతి విద్యార్థి సమ్మంగి భానుప్రసాద్ అత్యంత ప్రతిభ కనబరచి సిల్వర్ మెడల్ సాధించాడని పాఠశాల పీడీ కె.బాలస్వామి తెలిపారు. 400, 600 మీటర్ల పరుగు పందెంలో భానుప్రసాద్ విజయం సాధించాడని, త్వరలో పల్నాడు జిల్లాలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాడని చెప్పారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి భానుప్రసాద్‌ను గ్రామ సర్పంచ్ నందేటి గంగాభవాని, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.